క్లుప్తంగా

28 నుంచి ఉచిత సివిల్స్ ఫౌండేషన్ తరగతులు

గుంటూరు ఎడ్యుకేషన్: సివిల్స్‌కు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఈనెల 28 నుంచి వారం రోజుల పాటు ఉచిత ఫౌండేషన్ తరగతులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహించనున్నట్లు 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ పి.కృష్ణప్రదీప్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ అశోక్‌నగర్‌లోని సంస్థ కార్యాలయంలో నిర్వహించనున్న ఉచిత శిక్షణ తరగతుల్లో భాగంగా ఎన్‌సీఈఆర్టీ, జీఎస్, ఆప్షనల్ ఎంపిక, న్యూస్‌పేపర్ ఎనాలసిస్ తదితర అంశాలపై విశ్లేషణాత్మకంగా వివరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ ఆకెళ్ల రాఘవేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించే శిక్షణ తరగతుల్లో పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో పాటు సీనియర్ అధ్యాపకులు పాల్గొని అభ్యర్థులకు సూచనలు, సలహాలు అందిస్తారని చెప్పారు. ఉచిత రిజిస్ట్రేషన్ కోసం 040–35052121, 9000230735 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

చిన్నారులు సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలి



గుంటూరు ఎడ్యుకేషన్: ఏసీ కళాశాల వద్ద ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు సైన్స్ సబ్జెక్టుపై అవగాహన కల్పించారు. ఎమ్మెస్సీ జువాలజీ అధ్యాపకురాలు మణి తాగునీటిలో కాలుష్య కారకాలు, కాలుష్య నియంత్రణ, పరిష్కార మార్గాలపై విద్యార్థులకు బోధించారు. అనంతరం ఇంగ్లిష్ భాషలో పుస్తకాలను చదివించి విద్యార్థులకు వివరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురించి వివరించారు. గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

భాగ్యరెడ్డి వర్మకు నివాళి



నెహ్రూనగర్: దళితుల అంటరానితనం విముక్తి కోసం హైదరాబాద్ కేంద్రంగా శ్రమించిన మహనీయుడు భాగ్యరెడ్డి వర్మ అని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ తెలిపారు. సోమవారం అరండల్ పేటలోని భీమ్ భారత్ కార్యాలయంలో భాగ్యరెడ్డి వర్మ జయంతి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాల, మాదిగలను చైతన్యపరిచేందుకు బెంగాల్ నుంచి చెన్నై దాకా లక్నో నుంచి బెంగళూరు దాకా అనేక రూపాల్లో చైతన్యం తేవడమే కాకుండా హైదరాబాద్ కేంద్రంగా దళితుల విద్య కోసం 26 ప్రాథమిక పాఠశాలలు స్థాపించి 2650 మంది పిల్లలకు విద్యనందించినటువంటి మహానుభావులు భాగ్యరెడ్డి వర్మ అని కొనియాడారు. తొలుత వర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో భీమ్ సేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపు నీలాంబరం, భీమ్ భారత్ రాష్ట్ర నాయకులు దొడ్డ రాజేంద్రప్రసాద్, ఎస్.కె.బాజీ పాల్గొన్నారు.

25న మండల సమావేశం

కాకుమాను: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 25వ తేదీ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ డి.శరత్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి ఎంపీపీ అధ్యక్షత వహించనున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించే సమావేశంలో మండలంలోని గ్రామాలలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులపై సమీక్ష, చేపట్టాల్సిన పనులపై చర్చించనున్నట్లు తెలిపారు.

యువకుడు మృతి

గుంటూరు రూరల్: మత్తుపదార్థాలకు బానిసైన యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటనపై నల్లపాడు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు.. స్వర్ణభారతీనగర్ 12వ లైనుకు చెందిన షేక్ జబ్బీర్(18) మత్తు పదార్థాలకు బానిసై కుటుంబ సభ్యులను ఇబ్బంది పెడుతుంటాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఇంట్లో మృతి చెంది ఉండటంతో స్థానికులు తెలిసిన సమాచారం మేరకు నల్లపాడు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహంపై రక్తపు మరకలు గాయాలు ఉండటంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జగనన్న ఆణిముత్యాలు పథకానికి గురుకుల విద్యార్థి

తాడికొండ: జగనన్న ఆణిముత్యాలు పథకం కింద అందించే ప్రతిభా అవార్డుకు తాడికొండ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థి డి.శివశంకర్ నాయక్ ఎంపికయ్యాడు. ఈ ఏడాది నిర్వహించిన పది పరీక్షలలో 600 మార్కులకుగాను 548 మార్కులు సాధించి జిల్లాలో మూడో స్థానంలో నిలిచినందుకుగాను విద్యార్థికి ఈ పురస్కారం వరించింది. ఈ నెల 27న గుంటూరు జిల్లా కేంద్రంలో నిర్వహించబోయే జగనన్న ఆణిముత్యాలు అవార్డుల ప్రదానోత్సవంలో జిల్లా కలెక్టర్ నుంచి రూ.15 వేలు, సర్టిఫికెట్ అందుకోనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంబీడీ శ్యామల తెలిపారు. విద్యార్థిని ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

ప్రైవేట్ ట్రావెల్స్ ఇష్టారాజ్యం

రవాణా వ్యాపారం జోరుగా సాగుతోంది. ప్రైవేట్ ట్రావెల్స్ ఆధిపత్యం చేస్తోంది. అందుకు ఆర్టీసీ బస్టాండే కేంద్రం. రోడ్డుపై బస్సులు నిలిపి టికెట్లు అమ్ముకుంటున్నారు. ఆర్టీసీ అధికారులను పట్టించుకోవడం లేదు. పోలీసులు సహకరించడం లేదు. దీంతో నిత్యం ట్రాఫిక్ సమస్యగా మారింది. ఇటీవల ఒక హెడ్‌కానిస్టేబుల్ రోడ్డుపై అడ్డంగా పెట్టిన బస్సులకు సెల్‌ఫోన్ ఫైన్‌లు రాస్తుంటే... సదరు స్టేషన్ అధికారి వ్యక్తిగత సహాయకుడు ఫోన్ చేసి బెదిరింపులకు దిగినట్లు సమాచారం.

– పట్నంబజారు



ఆర్టీసీ బస్టాండ్ వద్ద రోడ్డుపై అడ్డంగా నిలిపిన ప్రైవేట్ బస్సులు

- ఆర్టీసీ బస్టాండ్ చుట్టూనే వ్యాపారం
- 2 కిలోమీటర్ల పరిధిలో నిలుపుదల నిషేధం ఉన్నా..
- కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్న అధికారులు
- ట్రాన్స్‌పోర్టు ఆటోల్లోనూ ప్రయాణికులను తరలిస్తున్నా చర్యలు నిల్

జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్. నిత్యం లక్షలాది మంది ప్రయాణిస్తుంటారు. ఇది గుంటూరు ఈస్ట్ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో ఉంది. బస్టాండ్‌కు రెండు కిలోమీటర్లు పరిధిలో ప్రైవేట్ వాహనాలను నిలపడకూడదన్న నిబంధన ఉంది. కానీ ఆర్టీసీ, పోలీస్, ఆర్టీఓ అధికారులు సమన్వయంతో పని చేస్తే అడ్డుకోవచ్చు. అందుకు అనుగుణంగా ఆర్టీసీ పరిరక్షణ కమిటీ పేరుతో ఇప్పటికే కొంత మేర అడ్డుకోగలుతున్నారు. ఈ అంశంలో ఆర్టీఓ అధికారులు పలుమార్లు ట్రాఫిక్ పోలీసులకు విన్నవించారు.

ప్రైవేట్ ట్రావెల్స్ దందా...

గుంటూరు నగర పరిధిలో సుమారు 70 వరకు ప్రైవేట్ బస్సులు ఉన్నాయి. స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిత్యం సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 11గంటలకుపైగానే ప్రైవేట్ బస్సులను తమని అడిగేవాడు లేడన్నట్లు యథేచ్ఛగా రోడ్డుపై అడ్డంగా గంటల పాటు నిలిచివేసి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు.

ట్రాఫిక్ చిక్కులు.. పోలీసులకు మూడుపులు

నిత్యం ట్రాఫిక్ నిలిచిపోతోంది. అయినా కనీసం హోంగార్డు, కానిస్టేబుల్ స్థాయి వ్యక్తులు కూడా అక్కడ ఉండడం లేదు. నిత్యం ఈ తంతు జరుగుతున్నప్పటికీ ట్రాఫిక్ అధికారులకు కనీసం కనపడుతున్నట్లు లేదు. ఇదేమని ఎవరైనా ప్రశ్నిస్తే.. మాత్రం నోటీసులు జారీ చేశాం... అని చేతులు దులుపుకుంటున్నారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆటోలు, సిటీ, ప్రైవేట్ బస్సులతో ప్రయాణం అంటనే నరకప్రాయంగా మారుతోంది. ఇటీవల రోడ్డుపై పెట్టిన బస్సుకు సంబంధించి పక్కకు పెట్టాలని ఒక హెడ్‌కానిస్టేబుల్ చెబితే.. మీ అధికారులతో మాట్లాడతాములే పొమ్మంటూ.. బెదిరింపులకు దిగిన పరిస్థితులు ఉన్నాయి. స్టేషన్‌కు భారీ ముడుపులు అందుతుండటతోనే కనీసం పట్టించుకున్న పాపాన పోవటంలేదనే విమర్శలున్నా. ప్రైవేట్ బస్సులపై ట్రాఫిక్ పోలీసులకు ఉన్న ప్రేమ అర్థమవుతోంది.

గూడ్స్ ఆటోల్లో ప్రయాణికుల తరలింపు...

కేవలం సరుకులు, ఇతరత్రా సామన్లు మాత్రమే తీసుకుని వెళ్లే గూడ్సు ఆటోల్లో ఆర్టీసీ బస్టాండ్, నందివెలుగు రోడ్డు, ఈస్ట్ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పక్కన ఉన్న కొల్లిబజారు, రామారావు విగ్రహం వద్దే ఎక్కించుకుని పోతున్నా.. పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. అయితే ఆటో స్టాండ్ వాళ్ల సైతం... వారి వంతు పంపటం... కానిస్టేబుల్ నుంచి అధికారుల వరకు ''తిలా పాపం తలా పిడికెడు' అన్న చందంగా వ్యవహరించటతో ఇటువంటి పరిస్థితులు ఉన్నాయి.

స్టేషన్ నిర్వహణ అస్తవ్యస్తమే....

ఈస్ట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో పోలీసింగ్ అస్తవ్యస్తంగా మారింది. బయట బారికేడ్లనుతో కేవలం రికవరీ వాహనం కోసం రోడ్డునంతా ఆక్రమించి వేశారు. దీనిపై ప్రశ్నిస్తే... మా వెహికల్ పెట్టుకోవాలి అంటూ.. ఆ వెహికల్ డ్రైవర్ నుంచి అధికారి వరకు నిర్లక్ష్య ధోరణితో సమాధానం చెబుతున్న పరిస్థితులు ఉన్నాయి. ఇటీవల కాలంలో ఒక ఆర్టీసీ బస్సు కనీసం టర్నింగ్ కూడా తీసుకోలేని పరిస్థితుల్లో రోడ్డుపై అడ్డంగా పెట్టిన బారికేడ్లను పక్కకు నెట్టి బస్సు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనితో పాటు పెట్రోలింగ్ కోసం వినియోగించే మూడు ద్విచక్ర వాహనాలు పక్కన పడి సంవత్సరాలు గడుస్తున్నా.. స్టేషన్ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.



ఈస్ట్ ట్రాఫిక్ స్టేషన్‌లో నిరుపయోగంగా పడి ఉన్న వాహనాలు

బస్సులు నిలపకుండా చర్యలు



ఇప్పటికే రోడ్లపై అడ్డంగా వాహనాలు నిలపకూడదని ప్రైవేట్ బస్సుల యాజమాన్యాలకు సూచించాం. ఎస్‌ఐ, కానిస్టేబుళ్లతో కూడిన బృందాన్ని ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటాం. ప్రైవేట్ బస్సుల యాజమాన్యాల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఆరోపణలపై కచ్చితంగా విచారణ చేపడతాం. రవాణా ఆటోల్లో ప్రయాణికుల తరలిస్తున్న అంశాన్ని పరిశీలిస్తాం. ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా దృష్టి పెడతాం.

– ఏ శ్రీనివాసరావు, ఏఎస్పీ క్రైమ్, ట్రాఫిక్ ఇన్‌చార్జి

ట్రాఫిక్ అధికారులకు ఫిర్యాదు

ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న ప్రైవేటు బస్సులకు సంబంధించి ట్రాఫిక్ అధికారులకు ఫిర్యాదు చేశాం. బస్టాండ్‌కు రెండు కిలో మీటర్ల పరిధిలో ప్రైవేటు వాహనాలు నిలుపరాదనే నిబంధనలున్నాయి. అయినప్పటికీ సిబ్బందిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసి బస్సులు ఆపకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– ఆర్టీసీ ఆర్ఎం జి.విజయగీత

విభాగాధిపతులే ఫిర్యాదులను పరిష్కరించాలి

నెహ్రూనగర్: జగనన్నకు చెబుదాం, స్పందనలో వచ్చే ఫిర్యాదులకు విభాగాధిపతులే నేరుగా పరిశీలించి పరిష్కరించాలని, ఏ ఒక్క ఫిర్యాదు పునరావృతం కాకుండా శాశ్వత ప్రాతిపదికన పరిష్కారానికి కృషి చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్లో స్పందన సోమవారం నిర్వహించారు. కమిషనర్ తొలుత జగనన్నకు చెబుదాం, స్పందన పోర్టల్, ఈఆర్‌పీ, వాట్సాప్, కాల్ సెంటర్ల ద్వారా అందిన ఫిర్యాదులపై అధికారులతో, సంబంధిత సిబ్బందితో సమీక్షించి ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజల నుంచి జగనన్నకు చెబుదాంకు అందే ఫిర్యాదుల పరిష్కారం పట్ల నేరుగా రాష్ట్ర స్థాయి అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నారని, ఫిర్యాదులను బాధ్యతతో పరిష్కరించాలన్నారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియచేయాలని కోరారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫొటోలు జత చేయాలని వివరించారు. సచివాలయ కార్యదర్శులు విభాగాల వారిగా తమ సచివాలయం పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలన్నారు. నోడల్ అధికారులు సచివాలయ కార్యదర్శుల పనితీరు, సేవలు, స్థానిక సమస్యలపై పర్యవేక్షణ చేయాలని, ప్రతి సోమవారం నోడల్ అధికారులతో సచివాలయ పనితీరుపై సమీక్ష చేయాలని అదనపు కమిషనర్‌ని ఆదేశించారు. ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 వరకు నిర్వహిస్తున్న స్పందనలో కార్యదర్శులు అందరూ వార్డు సచివాలయాల్లో అందుబాటులో ఉండాలని చెప్పారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 46 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 18, ఇంజినీరింగ్ విభాగానికి 14, రెవెన్యూ విభాగానికి 4, ప్రజారోగ్య విభాగానికి 6, ఉపా సెల్ విభాగానికి 1, అకౌంట్స్ విభాగానికి 2, పరిపాలన విభాగానికి ఒకటి చొప్పున ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు. ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఎస్ఈ భాస్కర్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్‌ఓ డాక్టర్ భానుప్రకాష్, ఏడీహెచ్ రామారావు, బయాలజిస్ట్ మధుసూదన్, మేనేజర్ శివన్నారాయణ, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

మోదీ పాలనపై విస్తృత ప్రచారం

గుంటూరు మెడికల్: ప్రధాని నరేంద్ర మోదీ పరిపాలన తొమ్మిదేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ కోరారు. స్థానిక ఆటోనగర్‌లోని గుంటూరు తూర్పు నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర సంఘటన్ ప్రధాన కార్యదర్శి మధుకర్ హాజరయ్యారు. రామకృష్ణ మాట్లాడుతూ మేధావులు, వ్యాపారస్తులతో సమావేశాలు నిర్వహించి ప్రధాని నరేంద్రమోదీ పరిపాలన గురించి వివరించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి చందు సాంబశివరావు, సీనియర్ నాయకులు యడ్లపాటి రఘునాథ బాబు, రాష్ట్ర కార్యదర్శి మాగంటి సుధాకర్ యాదవ్, గుంటూరు తూర్పు, పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్లు డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, తోట రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు యడ్లపాటి స్వరూపరాణి, పాలపాటి రవికుమార్, మకుటం శివ, జగ్గారపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామకృష్ణ

శరత్‌బాబు మృతికి నివాళి

పాత గుంటూరు: ప్రముఖ సినీ నటుడు శరత్‌బాబు మృతిపట్ల నగరంలోని కళాసంస్థల ప్రతినిధులు, సంఘాల నాయకులు సోమవారం సంతాపం వ్యక్తం చేశారు. గుంటూరుతో శరత్‌బాబుకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. 2019లో గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో కళాదర్బార్ సంస్థ వార్షికోత్సవంలో శరతబాబు పాల్గొని సందడి చేశారు. ఆయన మరణం కళారంగానికి తీరనిలోటని కళాదర్బార్ అధ్యక్షుడు, పొత్తూరి రంగారావు, భారతీ సాంస్కృతిక సంగీత కళావేదిక అధ్యక్షుడు మిరియాల ప్రసాదరావు, శుభాంజలి కళావేదిక అధ్యక్షుడు మేకల పురుషోత్తమ ప్రసాద్ పేర్కొన్నారు.

తాగునీటి చలివేంద్రాలు ఏర్పాటు

గుంటూరు మెడికల్: లైవ్ భారత్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, కేంద్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వల్లూరు జయప్రకాష్ నారాయణ ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. మంచినీటితోపాటు, ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఉచిత మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు బీజేపీ నేతలు పాలపాటి రవికుమార్, వెలగలేటి గంగాధర్ తెలిపారు.

ల్యాప్‌టాప్ అందజేత

పొన్నూరు(చేబ్రోలు): పొన్నూరు మండలం ఉప్పరపాలేనికి చెందిన విద్యార్థిని నాగిశెట్టి యామినికి కాపు సేవాసమితి ఆధ్వర్యంలో సోమవారం ల్యాప్‌టాప్‌ను నాయకులు అందజేశారు. రూ.48 వేలు విలువ చేసే ల్యాప్ టాప్‌ను విద్యార్థినికి అందజేశారు. కార్యక్రమంలో పొన్నూరు కాపు సేవాసమితి నిర్వాహకులు చందు వెంకటేశ్వరరావు, నాగమల్లేశ్వరరావు, ఆళ్ల శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, చందు సాంబశివరావు, భవన్నారాయణ పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో అధ్యాపకుల నియామకం

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి రూరల్, వడ్డేశ్వరం, దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని గ్రామాలలో ఉన్న జూనియర్ కళాశాలలకు ప్రభుత్వం ఉపాధ్యాయులను నియమించింది. సోమవారం ఆ ఉపాధ్యాయులు బాధ్యతలు స్వీకరించారు. వడ్డేశ్వరం జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ఉన్న జూనియర్ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా బి.శ్రీదేవి, ఇంగ్లీష్ లెక్చరర్‌గా కె.శ్రీరామచంద్రారెడ్డి, ఫిజిక్స్ లెక్చరర్‌గా సీహెచ్.వెంకటేశ్వరరావు, కెమిస్ట్రీ అధ్యాపకులుగా ఇ.ఆనందరావు, జువాలజీ అధ్యాపకులుగా ఎం.అరుణ, బాటనీ లెక్చరర్‌గా వై.లక్ష్మీ ప్రసన్నలు బాధ్యతలు స్వీకరించారు. ఈమని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ఇంటర్మీడియట్ బోధన కోసం మాథమెటిక్స్ లెక్చరర్‌గా వి.శర్వాణి, ఫిజిక్స్ లెక్చరర్‌గా కె.డేవిడ్, కెమిస్ట్రీ లెక్చరర్‌గా జె.వెంకట సుబ్బారావు, సివిక్స్ లెక్చరర్‌గా డి.శివనాగమణి, ఎకనామిక్స్ లెక్చరర్‌గా వి.కనకదుర్గ, కామర్స్ లెక్చరర్‌గా ఎం.సురేష్‌కుమార్, తెలుగు లెక్చరర్‌గా సీహెచ్ లక్ష్మణ్ కుమార్, ఇంగ్లీష్ లెక్చరర్‌గా ఎస్.చంద్రశేఖర్‌లు విధుల్లో చేరారు.



ఘనంగా ప్రతిష్టా మహోత్సవం

గుంటూరు రూరల్: భక్తుల్లో కోరిన కోరికలు తీర్చే గ్రామ దేవత పోలేరమ్మ తల్లి అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత తెలిపారు. సోమవారం మండలంలోని బుడంపాడు గ్రామంలో పోలేరమ్మ తల్లి, గణపతిస్వామి, నాగేంద్రస్వామి, పోతురాజు స్వామి నూతన విగ్రహ ప్రతిష్టా మహోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి పట్టు వస్త్రాలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ దేవత ఆశీర్వాదంతో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

జీవ వైవిధ్యం ద్వారానే సుస్థిర అభివృద్ధి సాధ్యం

పెదనందిపాడు: జీవ వైవిధ్యం ద్వారానే సుస్థిర అభివృద్ధి సాధ్యమని, ప్రకృతి వనరుల పరిరక్షణ ద్వారా సుస్థిర అభివృద్ధిని సాధించాలన్న లక్ష్యం సాధ్యమని ఎస్టీయూ గుంటూరు జిల్లా అధ్యక్షుడు గేరా మోహనరావు పేర్కొన్నారు. పెదనందిపాడు శాఖా గ్రంథాలయంలో సోమవారం అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని గ్రంథాలయ నిర్వాహకురాలు పి.సుభాషిని అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గేరా మోహనరావు మాట్లాడుతూ మానవాళి సహా వన్యప్రాణులు, వృక్షాలు, కీటకాలు, జలచరాలు, సూక్ష్మ క్రిములు తదితర ప్రకృతిలోని జీవరాశులన్నీ జీవ వైవిధ్యం పరిధిలోకి వస్తాయన్నారు. వనరుల వినియోగంలో పొదుపు పాటిస్తేనే ప్రకృతి వ్యవస్థలను, జీవజాలం ఉనికిని కాపాడుకో గలుగుతామని తెలిపారు. వనరుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు గారపాటి రమేష్, బొనిగల రత్నకుమార్, మంజుల, సుబ్బారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మోహనరావు

గుండెపోటుతో వెల్ఫేర్ సెక్రటరీ మృతి

మంగళగిరి: కార్పొరేషన్ పరిధిలోని పెదవడ్లపూడి–3 సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ గుమ్మడి చంద్రశేఖర్ (37) విధి నిర్వహణలో గుండెపోటుకు గురై మృతి చెందారు. ఆయనకు భార్య, ఒక కుమార్తె ఉన్నారు. కార్పొరేషన్ పరిధిలోని పెదవడ్లపూడిలో నివాసం ఉంటున్న చంద్రశేఖర్ ప్రతి రోజూ మాదిరి సోమవారం ఉదయం 10 గంటలకు విధి నిర్వహణ నిమిత్తం సచివాలయానికి హాజరయ్యారు. ఈనెల 26వ తేదీన తుళ్లూరు మండలం వెంకటపాలెంలో జరిగే ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి లబ్ధిదారులను ఆహ్వానించాలనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సచివాలయం నుంచి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లేందుకు బయలుదేరాడు. ఒక్కసారిగా గుండెపోటుకు గురై రోడ్డుపైనే కుప్పకూలిపోయాడు. స్థానికులు 108 వాహనంలో చినకాకాని ఎన్నారై వైద్యశాలకు తరలించారు. మార్గం మధ్యలోనే చంద్రశేఖర్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. భౌతిక కాయాన్ని ఆయన స్వగ్రామమైన పెదకూరపాడుకు తరలించారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) గుమ్మడి చంద్రశేఖర్ మృతికి సంతాపం తెలిపారు. విధి నిర్వహణలో ఉన్న వెల్ఫేర్ సెక్రటరీ గుండెపోటుకు గురై ఆకస్మికంగా మృతి చెందడం బాధాకరమని తెలిపారు. భౌతికకాయాన్ని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా సెక్రటరీ షేక్ ఆయూబ్, రామారావు సందర్శించి నివాళులర్పించారు.

హిందూ ఉపాధ్యాయ సమితి ప్రైవేటు విభాగం అధ్యక్షునిగా బద్రీ నారాయణ

గుంటూరు ఎడ్యుకేషన్: హిందూ ఉపాధ్యాయ సమితి రాష్ట్ర ప్రైవేటు ఉపాధ్యాయుల విభాగం అధ్యక్షునిగా గుంటూరు నగరానికి చెందిన హిందీ పండితుడు కపిలవాయి బద్రీ నారాయణ నియమితులయ్యారు. ఈమేరకు ఈనెల 21న నిర్వహించిన ఓ కార్యక్రమంలో హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ అధ్యక్షుడు దేగల మహేష్ నియామకపత్రం అందజేసినట్లు తెలిపారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

గుంటూరు ఈస్ట్: మహిళ మెడలో బంగారం గొలుసు తెంచుకుని పరారైన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. శ్రీనగర్ 7వలైనుకు చెందిన సునీత సోమవారం తన ఇంటి వద్ద నుంచి 8వ లైన్‌కు నడుచుకుంటూ వెళ్తుండగా ఆమె ఎదురుగా ద్విచక్ర వాహనంపై వచ్చిన ఒకరు మెడలోని 22 గ్రాముల బంగారం గొలుసు తెంచుకుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకెళ్లాలి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు స్థిరమైన లక్ష్యంతో ముందుకెళ్లాలని ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. పాశం రవీంద్ర యాదవ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజంలో టెన్త్‌లో 500 మార్కులకు పైగా సాధించిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులకు ఉపకార వేతనంతో పాటు జ్ఞాపిక, సర్టిఫికెట్ అందజేశారు. ముఖ్య అతిథిగా శ్రీనివాసరావు మాట్లాడుతూ చిన్నతనం నుంచి చదువులో రాణిస్తూ ఉన్నత స్థానానికి ఎదగాలని తెలిపారు. విద్యార్థులు బద్ధకం వదులుకుని చదువుపై శ్రద్ధ పెట్టి మంచి భవిష్యత్తు పొందాలన్నారు. ఓబీసీ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు సాధించిన ప్రతిభను కొనసాగిస్తూ భవిష్యత్‌లో మంచి ఉద్యోగం సంపాదించి తల్లిదండ్రులను వృద్ధాప్యంలో చక్కగా చూసుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుర్రా శ్రీనివాసరావు యాదవ్ మాట్లాడుతూ సొసైటీ ఆధ్వర్యంలో నిరుపేదలు నివసించే ప్రాంతాల్లో దుప్పట్లు పంపిణీ, ఆహార పొట్లాలు, దుస్తులు అందజేయడం, పేద విద్యార్థులకు పుస్తకాలు ఇవ్వడంతో పాటుగా బాగా చదివే విద్యార్థులకు తగిన పారితోషకాలు ఇవ్వడం వంటి కార్యక్రమాలు చేయడం గొప్ప విషయం అని కొనియాడారు. కార్యక్రమంలో అన్నదాన సమాజం చైర్మన్ పోకల వసంత్ కుమార్, నెహ్రూ యువ కేంద్ర జిల్లా కోఆర్డినేటర్ కిరణ్మయి రెడ్డి, ఉపాధ్యాయులు జువ్వా జ్ఞానేశ్వరరావు, గణేష్, నరసింహారావు, సత్యవాణి, మాధవి, అనంగి శ్రీనివాస్, రాణి రుద్రమదేవి, సొసైటీ అధ్యక్షుడు పాశం సర్దార్ అభినంద్, ఉపాధ్యక్షుడు దాసరి శ్రీనివాసరావు, కార్యదర్శి పాశం శ్రీకృష్ణదేవరాయ యాదవ్, సభ్యులు వెంకటరత్న శోభ, విజయ్ కుమార్ పాల్గొన్నారు.



విద్యార్థినికి ఉపకార వేతనాన్ని అందజేస్తున్న పాశం రవీంద్ర యాదవ్ సొసైటీ ప్రతినిధులు

విద్యార్థులను ప్రోత్సహిస్తే అద్భుత ఫలితాలు

దళిత మహాసభ కార్యదర్శి కత్తి పద్మారావు

పొన్నూరు(చేబ్రోలు): నేటి తరం విద్యార్థులకు సరైన ప్రోత్సాహం అందిస్తే అద్భుతమైన ఫలితాలు సాధిస్తారని ఏపీ దళిత మహాసభ ప్రధాన కార్యదర్శి, కవి డాక్టర్ కత్తి పద్మారావు అన్నారు. పొన్నూరు పట్టణంలో పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను డాక్టర్ కత్తి పద్మారావు సోమవారం సత్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులను టీవీ, సెల్ ఫోన్ వంటి వాటికి దూరంగా ఉంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. పట్టణ పరిధిలో ఉత్తమ ఫలితాలు సాధించి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన టి.జాహ్నవి, త్రిష, మహాలక్ష్మిలను ఆశీర్వదించారు. ఎస్ఎస్‌టీ డైరెక్టర్ కొలిపర్తి శివనాగేశ్వరరావు, ఉపాధాయులను అభినందించారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో డాక్టర్ కత్తి పద్మారావు

ఆలయ భూముల కౌలు హక్కుల వేలం

పెదకాకాని: ఆలయ భూములు కౌలు హక్కులకు సోమవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన ఐదు ఎకరాల మాగాణి భూమి, చేబ్రోలు మండలం శేకూరు శివారు వీరనాయకునిపాలెంలో ఉండగా ఏడాది కాలం పాటు కౌలుకు సాగు చేసుకునేందుకు రూ.1,38,000 హెచ్చు పాటు పలికిందన్నారు. అలాగే దేవరాయబొట్లవారిపాలెంలో అర ఎకరం మాగాణి భూమికి ఈ ఏడాది కౌలు వేలం నిర్వహించగా 2023–24 సంవత్సరానికి గాను రూ.14 వేలు పాడుకున్నారని వివరించారు. కౌలుకు సాగు చేసుకునేందుకు నిర్వహించిన పాటలను పర్యవేక్షించిన వారిలో రాష్ట్ర దేవదాయ ధర్మాదాయశాఖ అధికారిణి ఆర్.రమణమ్మ ఉన్నారు.



కౌలు బహిరంగ వేలం నిర్వహిస్తున్న ఏసీ ఎన్.శ్రీనివాసరెడ్డి